
బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## యాదగిరిగుట్టలో మార్చి 1 నుంచి బ్రహ్మోత్సవాలు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

యాదగిరిగుట్ట నరసింహస్వామి ఆలయంలో మార్చి 1 నుంచి 11 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా.. మార్చి 7వ తేదీన ఎదుర్కోలు మహోత్సవం, 8వ తేదీన తిరు కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. మార్చి 9న దివ్య విమాన రథోత్సవం నిర్వహించనున్నారు. మరోవైపు.. బ్రహ్మోత్సవాల దృష్ట్యా కళ్యాణాలు, హోమాలు, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చణ సేవను రద్దు చేసినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.యాదగిరిగుట్ట పంచనారసింహ స్వామి పుణ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఈ ఏడాదితో 70 సంవత్సరాలు పూర్తవుతాయి. కృష్ణశిలతో పునర్నిర్మితమైన ఆలయంలో మూడోసారి జరగనున్న ఈ వేడుకల్లో 50.5 అడుగుల ఎత్తు, ఐదంతస్థుల కృష్ణశిల గోపురం బంగారు కవచాలతో మహాదివ్యంగా దర్శనమిస్తోంది.

# పోలింగ్ ప్రశాంతం.. ఉద్రిక్తత



- నల్లగొండ-ఖమ్మం-వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 93.55శాతం
- కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ గ్రాడ్యుయేట్ స్థానానికి 70.42శాతం
- కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ గ్రాడ్యుయేట్ టీచర్స్ స్థానానికి 91.90శాతం నమోదైన పోలింగ్
- మార్చి 3న కౌంటింగ్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం పోలింగ్‌లో కొన్ని చోట్ల ప్రశాంతంగా, మరి కొన్ని చోట్ల ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.ఇక ఉమ్మడి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల టీచర్స్ నియోజకవర్గ ఎన్నికలో 93.55శాతం, ఉమ్మడి కరీంనగర్-ఆదిలాబాద్- నిజామాబాద్-మెదక్ జిల్లాల నియోజకవర్గ గ్రాడ్యుయేట్ స్థానానికి 70.42శాతం, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 91.90శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల్లో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీలు, ఇతర ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బ్యాలెట్ బాక్సులను నల్లగొండ, కరీంనగర్ కేంద్రాలకు తరలించి, భద్రపరిచారు. మార్చి 3వ తేదీన ఓట్ల కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఫలితం తేలాలంటే రెండు మూడ్రోజులు పడుతుందని, మొత్తంగా ఆరు ఫిర్యాదులు అందాయని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.

ఉమ్మడి వరంగల్- ఖమ్మం- నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ 93.55 శాతంగా నమోదైందని కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. మూడు ఉమ్మడి జిల్లాల్లోని 12 జిల్లాల్లో, మండలాల్లో 200 కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఎన్నిక జరిగింది. మొత్తం ఓటర్లు 25797 మంది ఉండగా, 24133 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఉమ్మడి కరీంనగర్- ఆదిలాబాద్- నిజామాబాద్- మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో గ్రాడ్యుయేట్స్, టీచర్ ఓట్లు ఎక్కువగా ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఓటింగ్ శాతం తగ్గింది. మొత్తంగా నాలుగు ఉమ్మడి జిల్లాల్లో అత్యధికంగా గ్రాడ్యుయేట్ పోలింగ్ నిజామాబాద్‌లో 76.18శాతం నమోదు కాగా.. టీచర్ ఎమ్మెల్సీలో మెదక్ జిల్లా ఉపాధ్యాయులు 95.03శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాలోని 15 జిల్లాల పరిధిలో చిన్న చిన్న ఘటనలు మినహా ఆయా కలెక్టర్ల పర్యవేక్షణలో పోలింగ్ సరళి ప్రశాంతంగా ముగిసింది. అనంతరం ఆయా జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్స్‌లను కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియానికి తరలించారు. మార్చి 3వ తేదీన ఓట్లను లెక్కించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

### బీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య వాగ్వాదం

మంచిర్యాల జిల్లా, నస్పూర్ మున్సిపాలిటీలోని తీగల్ పహాడ్ పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఉద్రిక్తత పరిస్థితికి దారితీసింది. ఈ నేపథ్యంలో బీజేపీ నేతపై స్థానిక ఎస్ఐ చేయి చేసుకున్నారని పేర్కొంటూ కార్యకర్తల ఆందోళనకు దిగారు. దీంతో బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ శ్రేణులు దూసు కెళ్ళాయి. పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఇరు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను చెదరగొట్టి.. పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా పోలీసు కమిషనర్ శ్రీనివాస్ అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం ప్రారంభమైంది. ఓటు హక్కును 69,134 మంది పట్ట భద్రులు, 5,693 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. అధికారులు150 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరుగుతోంది. ఎన్నికల విధుల్లో 1500 మంది సిబ్బంది, 2 వేల మంది పోలీసులతో బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకటి, రెండు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలో ఒకే ఓటరు ఉండగా.. పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి నలుగురు సిబ్బందిని కేటాయించారు.

# తెలంగాణ రైజింగ్.. హైదరాబాద్ రైజింగ్..

# ఇక ఆగదు

- ప్రపంచమంతా ఒప్పుకుంటోంది
- హైదరాబాద్, తెలంగాణ దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి
- ప్రపంచ స్థాయి నగరాలతో హైదరాబాద్ పోటీ
- తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల జీడీపీ కలిగిన రాష్ట్రంగా మార్చుతాం
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- హెచ్‌సీఎల్ టెక్స్ గ్లోబల్ డెలివరీ సెంటర్ ప్రారంభం




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

"రాష్ట్ర అభివృద్ధి కోసం తెలంగాణ రైజింగ్.. హైదరాబాద్ రైజింగ్.. అన్నప్పుడు మొదట్లో కొందరు సందేహాలు వ్యక్తం చేశారు. జరుగుతున్న పరిణామాలతో ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు. ప్రపంచమంతా ఒప్పుకుంటోంది. తెలంగాణ రైజింగ్.. హైదరాబాద్ రైజింగ్.. ఇక ఆగదు" అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.హైదరాబాద్ మాదాపూర్‌లో హెచ్‌సీఎల్ టెక్స్ గ్లోబల్ డెలివరీ సెంటర్‌ను ముఖ్యమంత్రి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ప్రస్తుతం హైదరాబాద్, తెలంగాణ దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా, రాష్ట్రంగా మారిందని చెప్పారు.హైదరాబాద్ పోటీ.. ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగుళూరు నగరాలతో కాదని, ప్రపంచ స్థాయి నగరాలతో తమ పోటీ అని అన్నప్పుడు అదో పెద్ద కలగా అభివర్ణించారు. కానీ ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్న తీరు నంబర్ 1 గా నిలిచినప్పుడు, రాష్ట్రాన్ని డేటా సెంటర్ల హబ్‌గా, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్, స్కిల్ డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్ రంగాల్లో తెలంగాణను మార్గదర్శిగా మార్చినప్పుడు ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు. ఇక హైదరాబాద్ రైజింగ్, తెలంగాణ రైజింగ్ ఆగదు.బహుళజాతి కంపెనీలతో ప్రతి రోజూ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం లేదా పెద్ద పెద్ద సంస్థలు హైదరాబాద్‌కు రావడం లేదా గతేడాది కుదుర్చుకున్న ఎంఓయూల మేరకు సరికొత్త సౌకర్యాలతో సిద్ధమైన కేఆర్‌సీ సెంటర్‌ను ప్రారంభించడం గర్వకారణంగా ఉంది.

కేవలం ఏడాది కాలంలోనే తెలంగాణ అంతర్జాతీయ, దేశీయ అత్యధిక పెట్టుబడులను ఆకర్షించి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను ముందుగా అందిపుచ్చుకున్నాం. పైగా రాష్ట్రంలో తక్కువ ద్రవ్యోల్బణాన్ని కాపాడుకున్నాం.తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల జీడీపీ కలిగిన రాష్ట్రంగా మార్చుతామని చెప్పినప్పుడు కొందరు సాధ్యం కాదన్నారు. కేవలం దావోస్ లో జరిపిన రెండు వ్యాపార పర్యటనల్లో 40 వేల కోట్ల రూపాయల విలువైన ఒప్పందాలు, 1.78 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. ప్రపంచంలోనే అత్యుత్తమ లైఫ్ సైన్సెస్ సంస్థల్లో ఒకటైన ఆమ్‌జెన్ ను హైదరాబాద్‌కు ఆహ్వానించాం. ప్రపంచంలోనే అత్యుత్తమ జీవ వైవిధ్య సదస్సుల్లో ఒకటైన బయో ఏషియా 2025 ను విజయవంతంగా నిర్వహించాం. ఇప్పుడు హెచ్‌సీఎల్ క్యాంపస్‌ను ప్రారంభిస్తున్నాం. 60 దేశాల్లో డిజిటల్, ఇంజనీరింగ్, క్లౌడ్,ఏఐ రంగాల్లో 2.2 లక్షల మంది ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ దేశ గౌరవాన్ని పెంచింది. 2007 లో హైదరాబాద్‌లో తొలిసారి ప్రారంభమైనప్పటి నుంచి అభివృద్ధి సాధిస్తూ ప్రస్తుతం 3.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 5 వేల మంది ఉద్యోగులతో ప్రపంచస్థాయి సరికొత్త సదుపాయాలతో హైదరాబాద్ హెచ్‌ఎసీఎల్ అద్భుతమైన విజయాలను సాధించబోతోంది" అని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఎల్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సి. విజయ్ కుమార్ గారు, సీవీపీ, డిజిటల్ బిజినెస్ గ్లోబల్ హెడ్ పవన్ వాడపల్లి గారు, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ గారితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.




## నీటిని సామరస్య పూర్వకంగా పంచుకోవాలి

- ప్రతి 15 రోజులకు ఒకసారి భేటీ కావాలని
- కేఆర్ఎంబీ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కృష్ణానది యాజమాన్య బోర్డు గురువారం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. శ్రీశైలం నాగార్జునసాగర్లలో ఉన్న నీటిని రెండు తెలుగు రాష్ట్రాలు వివాదాలు లేకుండా సామరస్య పూర్వకంగా పంచుకోవాలని బోర్డు దిశా నిర్దేశం చేసింది. మొదటగా తాగునీటి అవసరాలకు ప్రయారిటీ ఇవ్వాలని రెండు రాష్ట్రాలకు బోర్డు సూచించింది. పంటల సాగు కీలక దశలో ఉన్నందున.. అవసరానికి అనుగుణంగా వృథా కాకుండా నీటిని వాడుకోవాలని తెలిపింది. ఎవరికి ఎంత నీటి అవసరం ఉంటుందో ప్రతి 15 రోజులకు ఒకసారి భేటీ కావాలని బోర్డు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం సాగర్ నుంచి ఏపీ 7వేల క్యూసెక్కులు, తెలంగాణ 9వేల క్యూసెక్కుల వాటర్ డ్రా చేసుకుంటున్నట్లు పేర్కొంది. శ్రీశైలం నుంచి 2, 200 క్యూసెక్కుల నీటిని ఏపీ తీసుకుంటుంది. శ్రీశైలం నుంచి తెలంగాణ కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 2,400 క్యూసెక్కులు డ్రా చేసుకుంటున్నట్లు స్పష్టం చేసింది. రెండు ప్రాజెక్టులలో ఉన్న 70 టీఎంసీలను సమ్మర్ వరకు పొదుపుగా వాడుకోవాలని కృష్ణానది యాజమాన్య బోర్డు సూచనలు చేసింది.

## సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు.. మార్చి5కు వాయిదా

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వేంకటేశ్వర్లు సీఎం రేవంత్‌రెడ్డిపై దాఖలు చేసిన పరువు నష్టం క్రిమినల్ కేసు విచారణను గురువారం ప్రజాప్రతినిధుల కోర్టు చేపట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి కోర్టుకు హాజరుకాకపోవడంతో ఆయన తరపున గైర్హాజరు పిటిషన్‌ను కోర్టుకు సమర్పించడంతో కోర్టు అంగీకరించి వచ్చేనెల 5కు విచారణను వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో నల్గొండ జిల్లాలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ బహిరంగ సభలో బీజేపీ పార్టీ అధికారం చేపడితే రిజర్వేషన్లను పట్టించుకోదని రేవంత్ చేసిన వాఖ్యల పట్ల తమ పార్టీ పరువు ప్రతిష్టకు భంగం వాటిల్లే ప్రమాదముందని ఫిర్యాదుదారుడు కాసం కోర్టులో పరువు నష్టం దాఖలు చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు సీఎం కోర్టుకు హాజరుకాలేదు. ఫిర్యాదుదారుడి వాంగ్మూలంతోపాటు సాక్షుల వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసింది. ప్రముఖ టీవీ ఛానళ్లలో, పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాలకు సంబంధించిన క్లిప్పింగ్‌లను సాక్ష్యాధారాలుగా కోర్టుకు సమర్పించారు. ఫిర్యాదుదారుడి సాక్ష్యంతోపాటు సాక్షుల సాక్షాధారాల్ని పరిశీలించిన పిదప కోర్టు కేసు విచారణ కొనసాగిస్తుంది.

## ఎమ్మార్ ప్రాపర్టీస్ ప్రతినిధులతో సీఎం భేటీ



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో వివిధ ప్రాజెక్టులపై సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన వివాదాలను పరిష్కరించాలని ఎమ్మార్ ప్రాపర్టీస్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దుబాయ్‌కి చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్ ప్రతినిధులు సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో సమావేశమై వివిధ ప్రాజెక్టులపై నెలకొన్న వివాదాలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. 2001 లో ఉమ్మడి రాష్ట్రంలో దుబాయ్‌కి చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్ హైదరాబాద్‌లో కన్వెన్షన్ సెంటర్, హోటల్, గోల్ఫ్ కోర్సు, విల్లాల నిర్మాణం తదితర ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు అప్పటి ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. ఆనాటి ఏపీఐఐసీతో ఆ సంస్థ చేసుకున్న ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని అప్పట్లో సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయి. ఏజెన్సీల దర్యాప్తులు, కోర్టుల్లో విచారణలు కొనసాగుతున్నాయి.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015 అక్టోబర్‌లో అప్పటి ప్రభుత్వం ఎమ్మార్ సంస్థకు సంబంధించిన ప్రాజెక్టుల వివాదాల పరిష్కారానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సారథ్యంలో అయిదుగురు కార్యదర్శుల స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. మరోవైపు కేంద్ర విదేశాంగ శాఖ, సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా కూడా ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు.ఎమ్మార్ ప్రతినిధులతో జరిగిన తాజా చర్చల సందర్భంగా ఈ వివరాలన్నింటినీ అధికారులు ముఖ్యమంత్రి గారికి నివేదించారు. వివిధ దర్యాప్తు ఏజెన్సీల కేసులు, ఛార్జీషీట్లు, న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్నందున ఎమ్మార్ ఒప్పందాల డాక్యుమెంట్లు, కోర్టు కేసుల వివరాలతో పాటు కేంద్ర ప్రభుత్వ సూచనలన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు 2015 లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఆనాటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి అదనంగా న్యాయ నిపుణులతో కూడిన మరో కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి గారు సూచించారు.న్యాయ వివాదాలను అధ్యయనం చేయడానికి, సామరస్య పూర్వక పరిష్కారం చేసుకోవడానికి యూఏఈ ప్రభుత్వ ఆమోదంతో ఒక లీగల్ ఏజెన్సీని ఏర్పాటు చేస్తామని సంస్థ ప్రతినిధులు చేసిన ప్రతిపాదనను ముఖ్యమంత్రి గారు అమోదించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీ ఆ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి తదుపరి సూచనలు, సలహాలు అందిస్తుందని చెప్పారు. ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అలీ రషీద్ అలబ్బర్ నేతృత్వంలో భారత్‌లో యూఏఈ మాజీ రాయబారి డాక్టర్ అహ్మద్ అల్ బన్నా గారు, ఎమ్మార్ గ్రూప్ సీఈవో అమిత్ జైన్ గారు, ఆ కంపెనీ ఇంటర్నేషనల్ అఫైర్స్ హెడ్ ముస్తఫా అక్రమ్ గారు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గారు, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి గారు, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ గారు, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# టెక్నాలజీని బాధ్యతాయుతంగా వాడుకోవాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బెంగళూరులో ఎంట్రప్రెన్యూర్ టెక్ అండ్ ఇన్నోవేషన్ సమిట్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

టెక్నాలజీని బాధ్యతాయుతంగా వాడుకోకుంటే భారీ విధ్వంసం జరిగే అవకాశం ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాలు రెండు వైపులా పదునున్న కత్తిలాంటివి అని అన్నారు. బెంగళూరులో నిర్వహించిన ఎంట్రప్రెన్యూర్ టెక్ అండ్ ఇన్నోవేషన్ సమిట్‌లో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

డ్రోన్ టెక్నాలజీని వ్యవసాయానికి వాడుకోవచ్చు, యుద్ధానికి వాడుకోవచ్చు నిర్ణయించుకోవాల్సింది మనమే అని పేర్కొన్నారు. అందరికీ సాంకేతిక అక్షరాస్యత (డిజిటల్ లిటరసీ) లేకుంటే అందరికీ సమాన అవకాశాలు అందించలేమని తెలిపారు. దేశంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ జూదం ఘోరాలు భారీగా పెరుగుతున్నాయని తెలిపారు. కేవలం కాలర్ ట్యూన్ పెట్టి వీటిని అరికట్టలేం అని కేటీఆర్ స్పష్టం చేశారు. టెక్నాలజీ ప్రపంచాన్ని మలచడంలో ఉన్న అవకాశాలను వినియోగించుకునే విధంగా నూతన ఆవిష్కరణలు సాగాలని, సాంకేతికత అభివృద్ధి కావాలి, కానీ అది సమాజానికి మేలు చేయాలి. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నదని, కానీ ప్రతి సాంకేతిక ఆవిష్కరణ వెనుక మానవ అవసరాలు, నైతిక విలువలు నిలకడగా ఉండాలి. ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ , క్వాంటమ్ కంప్యూటింగ్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ , ఇంటర్నెట్ ఆఫ్ బాడీస్ వంటి సాంకేతిక పరిణామాలు ప్రపంచాన్ని మార్చగలవని తెలిపారు.


రేడియోలు మాయమయ్యాయి, టీవీలు వచ్చాయి, ఇప్పుడు పాడ్‌కాస్టుల హవా. ఫార్మాట్ మారుతుండొచ్చు, కానీ మానవ అవసరాలు ఎప్పటికీ మారవు. సాంకేతికతను బాధ్యతగా ఉపయోగించకపోతే అది ప్రమాదకరమవుతుంది. భవిష్యత్తు నిర్మాణం అంటే కేవలం రేపటి రోజుల్లో జీవించడం కాదు.. రేపటిని నిర్మించడం. ఇదే స్ఫూర్తితో సామాజిక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని టెక్నాలజీ అభివృద్ధి జరగాలి. డ్రోన్స్ వ్యవసాయాన్ని సమృద్ధవంతంగా మార్చగలవు.. అదే డ్రోన్స్ విధ్వంసానికి ఉపయోగిస్తే అది ప్రమాదకరం. అందుకే ప్రతి టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది అని కేటీఆర్ పేర్కొన్నారు.

ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితంతో పెనువేసుకుంటున్న కొద్దీ.. సాంకేతిక ప్రగతి పెరుగుతున్న కొద్దీ.. సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. టెక్నాలజీ సామర్థ్యం అధికంగా ఉన్న యువత సైబర్ నేరాలకు ఎందుకు పాల్పడుతున్నారో ఆలోచించాలి. సైబర్ నేరాలపైన కేవలం ఒక కాలర్ ట్యూన్ పెట్టి ఆపలేము. అంతేకాక, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ వలన జరుగుతున్న దుష్పరిణామాలను ఆపడం ప్రభుత్వాలు నడిపే వారికి పెద్ద సవాలుగా మారిందని కేటీఆర్ అన్నారు.

సాంకేతిక అభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణ అంశాన్ని అనుసంధానం చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి రోజూ భారీ డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. వాటి విద్యుత్, వాటర్ వినియోగంపై ఎవరూ దృష్టి పెట్టడం లేదు. అంతేకాక, టెక్నాలజీ వల్ల పర్యావరణంపై కలిగే ప్రభావం గురించి తగిన అధ్యయనం లేకుండా ముందుకు వెళితే భవిష్యత్తు ఇబ్బందికరంగా మారుతుంది. ఐటీ, మొబైల్ యాప్‌లు, డేటా స్టోరేజ్ ఇవన్నీ పెరుగుతున్నాయి. కానీ, అవి ఎంతగా పర్యావరణ భంగాన్ని కలిగిస్తున్నాయో ఆలోచించాలి. ప్రస్తుతం తమ మాతృభాషల పట్ల జరుగుతున్న వివక్ష గురించి మాత్రమే కాకుండా టెక్నాలజీ తెలిసినవారు టెక్నాలజీ తెలవని వారు అని సమాజంలో ఏర్పడుతున్న సరికొత్త విభజనపైన దృష్టి సారించాలి. టెక్నాలజీ నిరక్షరాస్యత ఉన్న జనాభాకి ఏ విధంగా సహాయం చేయాలో ఆలోచించాలి. డిజిటల్ విభజన పెరుగుతున్నకొద్దీ సమాజంలో మరింత విభజన వస్తుంది.. టెక్నాలజీ అందరికీ సమానంగా అందినప్పుడే సమాన అవకాశాలు ఏర్పడతాయని కేటీఆర్ తెలిపారు.

## ఎన్నికల ప్రచారం ముఖ్యమా? కార్మికుల ప్రాణాలు ముఖ్యమా..?

- ఎమ్మెల్యే హరీశ్‌రావు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల ప్రచారం ముఖ్యమా? ఎనిమిది మంది ప్రాణాలు కాపాడటం ముఖ్యమా? అని రేవంత్ రెడ్డిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎస్-ఎల్‌బీసీ ప్రమాద ఘటన జరిగి ఆరు రోజులైనా సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికీ రాలేదు.. ఎందుకింత బాధ్యతారాహిత్యం..? అని నిలదీశారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వద్ద హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.ఆరు రోజుల తర్వాత తీసింది కేవలం తట్టెడు మట్టి మాత్రమే. 8 మంది ప్రాణాలు కాపాడటం పట్ల ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా..? కాంగ్రెస్ సర్కార్ అవినీతి, నిర్లక్ష్యంతో 15 నెలల్లోనే 4 ప్రాజెక్టులు కూలిపోయినయ్. ప్రమాద ఘటనలో చిక్కుకున్న 8 మంది కార్మికుల ప్రాణాలు కాపాడే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఆరు రోజులైనా ఇప్పటి వరకు సరైన డైరెక్షన్ లేదు. మంత్రులు పొద్దున వస్తున్నారు.. సాయంత్రం పోతున్నారు.. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఏమైనా టూరిస్ట్ ప్లేసా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బృందాల మధ్య సమన్వయం సాధించడంలో ప్రభుత్వం విఫలమైంది. టన్నెల్‌లోకి వెళ్లేందుకు మాకు అనుమతి ఇవ్వలేదు. సహాయ చర్యలకు ఇబ్బంది అవుతుందని ఇన్ని రోజులు రాలేదు. ప్రజాప్రతినిధులం మంత్రిని కలవకూడదా..? ప్రమాదానికి సంబంధించిన విషయాల గురించి మాట్లాడకూడదా..? ఇదెక్కడి ప్రజా పాలన..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు నిలదీశారు.

ఇక ఉన్న ప్రాజెక్టులను కాపాడలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. ఏపీ ప్రభుత్వం అక్రమంగా కృష్ణా జలాలు తరలించుకుపోతోంది. మన నీటిని ఏపీ తరలించుకుపోతుంటే ఈ ప్రభుత్వం ఆపడం లేదు. గోదావరిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తుంటే సీఎం రేవంత్ రెడ్డి నోరెత్తడం లేదు. కృష్ణా జలాలపై మేము నిలదీసిన తర్వాత కేఆర్ఎంబీ వద్దకు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర హక్కులను కాపాడటంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# సిరిసిల్లలో ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్...

- ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలించిన కలెక్టర్



బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:

ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆయా పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణం కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 374,375,376 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలను, గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 371,372,373 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలను, 187 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రం, కోనరావుపేట మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 363,364 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాన్ని, 183 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రం, వీర్నపల్లి మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 385 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాన్ని, 192 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రం, గంభీరావుపేట మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 379,380 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలను, 189 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రం, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 386,387 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలను, 193 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రం, ముస్తాబాద్ మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 381,382 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలను, 190 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ సరళిని కలెక్టర్ పరిశీలించారు.

# మార్చి 2న వనపర్తికి సీఎం

- రూ.721 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన
- మంత్రి జూపల్లి కృష్ణారావు



**బలగం టీవీ, వనపర్తి**

మార్చి 2న వనపర్తి నియోజకవర్గంలో రూ.721 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేయనున్నారని రాష్ట్ర అబ్కారి, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గురువారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, స్థానిక శాసన సభ్యులు తూడి మేఘారెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి. జూపల్లి మాట్లాడుతూ వైఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయంలో శ్రీశైలం ఎస్ఎల్బీసీ టన్నెల్ సొరంగం పనులు 2006లో ప్రారంభించడం జరిగిందని, దాదాపు 44కి. మీ సొరంగం పనులకు గాను..25కి.మీ పనులు కాంగ్రెస్ హయాంలోనే పూర్తి కావడం జరిగిందన్నారు. 10ఏండ్ల కేసీఆర్ పాలనలో 11కి. మీ మాత్రమే సొరంగం పనులు పూర్తి చేశారని..రూ. 8లక్షల కోట్లు అప్పులు చేసి కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టుల్లో సొరంగం పనులు పూర్తి చేసిన కేసీఆర్.. ఈ పనులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే 3లక్షలకు ఎకరాలకు సాగునీరు అందుతుందని, కాంగ్రెస్ కు పేరు వస్తుందనే ఈ పనులు కేసీఆర్ చేపట్టలేదని విమర్శించారు.తక్కువ ఖర్చుతో ఎలాంటి విద్యుత్ సమస్య లేకుండా సాగునీరు అందించే అవకాశం ఉంటుందని, సమస్యను పరిష్కరించే దిశగా సీఎం. రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. మాజి మంత్రి. హరీష్ రావు శ్రీశైలం సొరంగం సందర్శించి ,ప్రమాదంలో చనిపోయిన సీఎం. రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని అనడం సిగ్గు చేటన్నారు. గత ప్రభుత్వ హయంలో కాళేశ్వరం, పాలమూరు –రంగారెడ్డి, శ్రీశైలం పవర్ హౌస్ లో చనిపోతే కేసీఆర్ ఏనాడైన సందర్శించారా అని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు గురించి ప్రశ్నించే అర్హత కేసీఆర్, హరీష్ రావు , ఇతర బిఆర్ఎస్ నేతలకు లేదన్నారు.ప్రమాద ఘటనకు సంబంధించి బాధితులను కాపాడడం కోసం నేవీ, ఎన్డీఆర్ఎఫ్ సహా 11 సంస్థలను రప్పించి బాధితులను కాపాడే ప్రయత్నం జరుగుతోందన్నారు.

టన్నెల్ లో 11.8 కిలోమీటర్ల లోనికి తాను కూడా వెళ్లానని, అక్కడ భయానక పరిస్థితి నెలకొందన్నారు. దేశంలోని వివిధ సంస్థల ద్వారా నిష్ణాతులను పిలిపించి సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. సీఎం ఘటన స్థలికి రాకపోయినప్పటికీ ప్రతి రోజూ సహాయ కార్యక్రమాలపై సమీక్షిస్తున్నారన్నారు. గత పదేళ్ల కాలంలో కేసీఆర్ ఏనాడైన అంబేద్కర్ కు పూల మాల వేశాడా అని ప్రశ్నించారు. వనపర్తిలో ఎమ్మెల్యే మేఘా రెడ్డి పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు.మొదటిసారి సీఎం రేవంత్ రెడ్డి వనపర్తికి రాబోతున్నారని, తాను చదివిన పాఠశాల అభివృద్ధి సహా రూ.721 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి 14 నెలల్లో విద్యా, వైద్య, క్రీడల పరంగా సుమారు రూ.1000 కోట్ల అభివృద్ధి పనులను వనపర్తికి తెప్పించగలిగారన్నారు. జాబ్ మేళా, రుణమేళా, స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాలు చేస్తున్నారని, సుమారు వెయ్యి మంది స్థానికులకు ఉద్యోగాలు కల్పించే పని చేస్తున్నారన్నారు. మొదటి సారి శాసనసభ్యులు అయినప్పటికీ నిత్యం ప్రజలతో ఉంటూ ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేస్తున్నారన్నారని మంత్రి. జూపల్లి కొనియాడారు.

ప్రభుత్వం అమలు చేసిన 6గ్యారంటీలో 5గ్యారంటీలు అమలు చేయడం జరిగిందని.. వనపర్తిలో జాబ్ మేళా, రుణమేళా, స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాలతో సుమారు వెయ్యి మంది స్థానికులకు ఉద్యోగాలు కల్పించే పని చేస్తున్నామని ఎంపీ మల్లు రవి అన్నారు.సీఎం వనపర్తిలో చదువుకున్న నేపథ్యంలో, ఆయనకు ఇక్కడి ప్రాంతంలో మంచి అనుబంధం ఉన్న కారణంగా వనపర్తి అసెంబ్లీ అభివృద్ధి కోసం రూ.721 కోట్లతో శంకుస్థాపనలు చేయబోతున్నారన్నారు. సీఎం రేవంత్ ఆయనతో చదువుకున్న వారందరితో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొననున్నారన్నారు. ఆయన ఇక్కడి ఉన్నప్పుడు పార్వతమ్మ అనే వారి ఇంట్లో ఉండి చదవుకున్నారని, వారి ఇంటికి కూడా సీఎం రాబోతున్నారన్నారని మల్లు రవి అన్నారు.

ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ 14 నెలల కాలంలో వనపర్తిలో రూ.397 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందించారన్నారు.మార్చి 2 తేదీన రూ.721 కోట్లకు సంబంధించి శంకుస్థాపనలు చేయబోతున్నారని చెప్పారు. వనపర్తిలో వెంకటేశ్వర స్వామి టెంపుల్ అభివ్రుద్ధికి రూ.1 కోటితో శంకుస్థాపన చేయనున్నారన్నారు. రూ.257 కోట్లతో హాస్పిటల్ నిర్మాణానికి, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. రూ.60 కోట్లతో తాను చదువుకున్న జడ్పీ స్కూల్,జూనియర్ కళశాల అభివృద్ధి కి శంకుస్థాపన చేయనున్నారన్నారు. రూ.22 కోట్లతో ఐటీ టవర్ కు, రూ. 81 కోట్లతో కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి, రాజనగరం నుంచి పెద్దమందడి రోడ్డుకు రూ.40 కోట్లతో శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు.సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, డిసిసి రాజేంద్రప్రసాద్, ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్ఎన్ఎల్ పునరుద్ధరణ జరగాలి

- ఎంపీ ఈటల రాజేందర్



**బలగం టీవి, హైదరాబాద్**

ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ పునరుద్ధరణ జరగాలని దీనికి హైదరాబాద్ పెద్దన్న పాత్ర పోషించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం హైదరాబాద్ లో జరిగిన టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్ బీఎస్ఎన్ఎల్ పునరుద్ధరణకు ఎంపీలు అందరం మద్దతుగా ఉంటామన్నారు. బీఎస్ఎన్ఎల్ గొప్ప సంస్థగా ఎదగడానికి కావాల్సిన ప్రణాళికలను రూపొందించాలని, టెలికాం విభాగంలో మేమే సుప్రీం అనే భావనకు బీఎస్ఎన్ఎల్ రావాలన్నారు. తాడు బొంగరం లేని సంస్థలు ఎదుగుతున్నప్పుడు, ఇన్ని ఆస్తులు ఉండి, ఇంతమంది మాన్ పవర్ ఉన్నప్పుడు మనం ఎందుకు ఎదగడం లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు బాగుపడాలనేది ప్రధాని నరేంద్ర మోడీ ఆలోచన అని చెప్పారు. మనం ఎలక్ట్రానిక్ యుగంలో ఉన్నామని, గవర్నమెంట్ పాలసీలు ఎలా ఉన్నా మీ ఇన్నోవేషన్, కమిట్‌మెంట్, ప్రయత్నం ఉండాలని అది ఉంటే మీకు ప్రభుత్వం తోడుగా ఉంటుందన్నారు. లాభనష్టాల కోసం కాకుండా సర్వీస్ ఓరియెంటేషన్ తో పనిచేసే సంస్థ బీఎస్ఎన్ఎల్ అన్నారు.

## ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదం.. కొనసాగుతున్న సహాయక చర్యలు

**బలగం టీవి, హైదరాబాద్**

శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్బీసీ) టన్నెల్ ప్రమాద ఘటనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలను నిర్విరామంగా కొనసాగిస్తున్నది. 11 సర్కారీ ఏజెన్సీలతో దాదాపు 400 మంది అధికారులు, ఉద్యోగులు, ఇంజినీర్లు, ఇతర సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ప్రధానంగా ఆర్మీ, నేవీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా, జీఎస్ఐ, ఎన్జీఆర్ఐ, సాగునీటిపారుదల శాఖతోపాటు ప్రయివేటు ఇంజినీరింగ్ కంపెనీలు టన్నెల్ ప్రమాద ఘటనను సుఖాంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నా కొలిక్కి రావడం లేదు. మట్టి దిబ్బలు, నీటిఊట, బురదను తొలగిస్తే తప్ప ముందుకుపోయే పరిస్థితులు కనిపించడం లేదు. టీబీఎం లోపల సహాయక చర్యలు చేపట్టడం శక్తికిమించిన పని అవుతున్నది. చిమ్మచీకటి కారణంగా లోపలికి పోవడమే గగనమవుతున్న తరుణంలో బాధితులను బయటకు తేవడం ఆషామాషి కాదని అంటు న్నారు. టీబీఎం ఆవల పరిస్థితి ఎలా ఉందో ఇప్పుడే చెప్పడం కష్టమని కూడా అభిప్రాయ పడుతున్నారు. 144 గంటల తర్వాత మట్టి ఎంత తీసినా ఇంకా పడుతుం డటం, నీళ్ల ఎత్తిపోసిన కొద్దీ ఇంకా ఊరుతుండటం, బురద ఎప్పటికప్పుడు పెరుగుతున్న నేపథ్యంలో పరిస్థితి ఆశాజ నకంగా లేదనే వ్యాఖ్యానాలు సహాయక చర్యల పర్యవేక్షకుల నుంచి వసు న్నాయి. మంత్రు లు, రెండు జిల్లాల కలెక్టర్లు, డిజాస్టర్ మేనేజ్ మెంటు బృందాలతోపాటు వందలాది మంది సహాయక సిబ్బంది కార్మికులను కాపాడేందుకు 24 గంటలపాటు టన్నెల్ లోపలకు, బయటకు తిరుగుతున్నారు.

## మహాకుంభమేళాకు 45 రోజుల్లో 66.3 కోట్ల మంది

- ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్



**బలగం టీవి, ప్రయాగ్‌రాజ్**

మహాకుంభమేళాకు గత 45 రోజుల్లో 66.3 కోట్ల మంది యాత్రికులు , పర్యాటకులు వచ్చారని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. మహాకుంభ్‌మేళాను విజయవంతంగా నిర్వహించడమే కాక, ప్రపంచ స్థాయి వేడుకగా చేయడం మోడీ విజన్ వల్లనే సాధ్యమైందని ప్రశంసించారు. మహాకుంభమేళా ముగిసిన సందర్భంగా పాత్రికేయులను ఉద్దేశిస్తూ ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం వివరాలు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసినందుకు మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. విశ్వాసాన్ని, ఆర్థికవ్యవస్థను సమ్మిళితం చేసే మోడీ సంకల్పాన్ని కొనియాడుతూ ఆధ్యాత్మిక పర్యాటకానికి కావలసిన అపారసామర్థం ఉత్తరప్రదేశ్‌కు ఉందని పేర్కొన్నారు.అయోధ్య, వారణాసి, మధుర, ప్రయాగ్‌రాజ్, చిత్రకూట్, వింధ్యాచల్, గోరఖ్‌పూర్, నైమిశారణ్య, తదితర ప్రముఖ పర్యాటక ప్రదేశాలతోసహా ఉత్తరప్రదేశ్ లోని వివిధ మతపరమైన క్షేత్రాలను 2024లో 64 కోట్ల మంది యాత్రికులు, పర్యాటకులు సందర్శించారని చెప్పారు. ప్రయాగ్‌రాజ్ లోని మహాకుంభమేళాకు గత 45 రోజుల్లో 66.3 కోట్ల మంది యాత్రికులు , పర్యాటకులు వచ్చారని, ఆధ్యాత్మిక పర్యాటకంలో కొత్త రికార్డులు సృష్టించారని వివరించారు.

## సీఎం రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ ముఖ్యమంత్రి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**బలగం టీవి, హైదరాబాద్**

సీఎం రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆయన ప్రధాని నరేంద్ర మోడీ డైరెక్షన్‌లో పనిచేస్తున్నారని విమర్శించారు. ప్రతీ విషయంలో బిజెపితో సిఎం రేవంత్ రెడ్డి కలిసి పనిచేస్తున్నారని, ప్రధాని వెడీని సిఎం కలిసిన తర్వాత బిజెపి, కాంగ్రెస్ మధ్య దోస్తీ బట్టబయలైందని వెల్లడించారు.తెలంగాణ భవన్‌లో గురువారం నాడు బిఆర్ఎస్ నేతలతో కలిసి కవిత మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీ నాయకులే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దగ్గరుండి కాపాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తాము ప్రజల్లో ఎండగట్టగానే బిజెపి నాయకులు తమను విమర్శిస్తున్నారని, దీన్ని బట్టి ఆ రెండు జాతీయ పార్టీలు కలిసి పనిచేస్తున్నట్లు తేటతెల్లమవుతోందని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్, బిజెపి మధ్య భాగస్వామ్యం ఉందని, అందులో భాగంగానే లేనిపోని విషయాలను తెచ్చి ఆ రెండు పార్టీల నాయకులు బిఆర్ఎస్ పార్టీకి అంటగడుతున్నారని మండిపడ్డారు. న్యాయవాది సంజీవ రెడ్డి కోర్టులో వాదిస్తూ అందరి ముందే ఆరు నెలల క్రితమే గుండె పోటుతో మరణించారని, భూపాలపల్లిలో భూతగాదాల వల్లనే హత్య జరిగినట్లు జిల్లా ఎస్పి చెప్పారని, దుబాయ్‌లో ఒక వ్యక్తి నిద్రలోనే చనిపోయారని పత్రికల్లోనే వచ్చిందని, మరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధం లేని ఈ సంఘటనలను బీఆర్ఎస్ పార్టీకి ఎందుకు అంటగడుతున్నట్లు..? అని నిలదీశారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు కలిసి ఆడుతున్న డ్రామా ఇది అని మండిపడ్డారు.

## అశోక హెూటల్‌కు బాంబు బెదిరింపు

**బలగం టీవి, హైదరాబాద్**

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న అశోక హెూటల్‌కు బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. బుధవారం రాత్రి బాంబు బెదిరింపు కాల్ రావడంతో.. అటుగా వెళ్తున్న ప్రయాణికులు, చిరు వ్యాపార్లు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వివరాల్లోకెళ్తే.. బుధవారం అర్ధరాత్రి సికింద్రాబాద్ స్టేషన్ ఎదురుగా ఉన్న అశోక హెూటల్లో బాంబు పెట్టినట్టు అగంతకుడు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ కాల్ చేశాడు. దాంతో అప్రమత్తమైన పోలీస్ కంట్రోల్ రూమ్ పోలీసులు.. గోపాలపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు హెూటల్లో భోజనం చేయడానికి వచ్చిన ప్రయాణికులందరిని బయటకు పంపి గంట పాటు డాగ్స్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. చివరికి బాంబు లేదని, అది ఫేక్ కాల్‌గా తేల్చారు. దాంతో గోపాలపురం పోలీసులు, అటు ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

## కార్మికులను రెండ్రోజుల్లో బయటకు తీసుకొస్తాం : మంత్రి

**బలగం టీవి, హైదరాబాద్**

ఎస్ఎల్బీసీ సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను రెండ్రోజుల్లో బయటకు తీసుకొస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సొరంగం పనులు చేశామంటున్న బీఆర్ఎస్ నేతలు ఎవరి దగ్గర అనుమతులు తీసుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. పదేండ్లపాటు నిర్లక్ష్యంగా వ్యవహరించినందు వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. త్వరలో మళ్లీ సొరంగం పనులు పున్ణప్రారంభిస్తామని తెలిపారు. ఎస్ఎల్బీసీ ద్వారా 30 టీఎంసీల నీటిని పంపింగ్ చేసి నాలుగు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందని అన్నారు. ప్రాజెక్టుల పేరుతో జేబులు నింపుకున్న హరీశ్‌రావుకు కాంగ్రెస్‌ను విమర్శించడానికి సిగ్గుండాలన్నారు. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కుంగిపోయిందని, బీఆర్ఎస్ మానస పుత్రిక అని చెప్పుకుంటున్న పాలమూరు–రంగారెడ్డి ద్వారా ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. ఎడమ గట్టు విద్యుత్ ప్లాంట్‌లో మంటలు చెలరేగినప్పుడు అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న రేవంత్‌రెడ్డి ప్రాజెక్టు సందర్శనకు వెళితే అరెస్టు చేయలేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ఒక న్యాయం.. బీఆర్ఎస్‌కు మరో న్యాయం ఉండదని ఈ సందర్భంగా తెలుసుకోవాలని అన్నారు. దేవాదుల ప్రాజెక్టులో ఏడుగురు కార్మికులు చనిపోతే నోరెత్తని హరీశ్‌రావు ఇప్పుడు గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు.

# రాజన్న.. పాహిమాం..పాహిమాం..







## రాజన్న ఆలయంలో వైభవంగా మహాశివరాత్రి

### దర్శనానికి బారులుతీరిన జనం

**బలగం టీవీ , వేములవాడ**

వేములవాడలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణకాశీగా పేరుగాంచిన రాజన్న ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శివరాత్రి సందర్భంగా రాజన్న సన్నిధి భక్తుల రాకతో పుల కించింది. భారీ సంఖ్యలో భక్తులు తర లివచ్చారు. అర్ధరాత్రి సమయంలో మొదలైన లింగోద్భవం సమయంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు అంతకుముందు మహాలిం గార్చన కనులపండువగా నిర్వహించారు.ఏర్పాట్లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు.

**రాజన్న సేవలో ప్రముఖులు..**

రాజన్నను కేంద్రమంత్రి బండి సంజయ్ దర్శించుకున్నారు.



ఆలయానికి చేరుకున్న బండి సంజయ్ ని ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అద్దాల మంటపంలో స్వామి వారి ప్రసాదాలు అందించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్వామి వారిని దర్శించుకున్నారు.

**ముగిసిన శివదీక్షలు..**

వేములవాడ ప్రాంతంలో 41 రోజులుగా శివదీక్షలో తరించిన మాలధారులు బుధవారం విరమణ చేశారు. శివదీక్షాపరులకు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. సామూహిక మహాలింగార్చన వైభవంగా జరిగింది.








## అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం

### అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు గ్రామ ప్రజలు

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని శివాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. నీలోజీపల్లి గ్రామంలో అనుముల భాస్కర్–నవీన దంపతులు స్వామివారికి పట్టు వస్త్రములు సమర్పించి, కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. నీలోజిపల్లి గ్రామంలో శ్రీ నీలకంఠేశ్వర సహిత ఆంజనేయ స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవ కమిటీ మరియు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ శివ పార్వతుల కళ్యాణం మరియు లింగోద్భవ మహా రుద్రాభిషేకం చేసారు. విలాసాగర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ త్రిలింగ సంగమేశ్వర స్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా శివ పార్వతిల ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి, మేళతాళాల మధ్య కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి, వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



# పాకిస్థాన్ బంగ్లాదేశ్ మ్యాచ్ రద్దు



**బలగం టీవి, హైదరాబాద్**


ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా గురువారం జరగాల్సిన పాకిస్థాన్–బంగ్లాదేశ్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. . ఉదయం నుంచే వర్షం ఎడతెరిపి లేకుండా కురవడంతో ఔట్ ఫీల్డ్ మొత్తం చిత్తడిగా మారింది. ఔట్ ఫీల్డ్‌లో మొత్తం నీళ్లు చేరడంతో మ్యాచ్ నిర్వహణ సాధ్యం కాలేదు. దాంతో టాస్ కూడా వేయకుండానే ఈ మ్యాచ్‌ను అంపైర్లు రద్దు చేశారు. ఇరుజట్లకు చెరో పాయింట్ ఇస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో స్వదేశంలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిని పాకిస్థాన్ ఒక్క మ్యాచ్ కూడా నెగ్గకుండానే ఇంటిముఖం పట్టింది. అటు బంగ్లాదేశ్‌ది కూడా అదే పరిస్థితి.



# ప్రాక్టీస్‌కు దూరంగా రోహిత్, గిల్!

**బలగం టీవి, హైదరాబాద్**

ఛాంపియన్స్ ట్రోఫీలో వరుసగా రెండు మ్యాచ్‌లలో గెలిచి టీమిండియా సెమీస్‌కు దూసుకెళ్లింది. ఇక గ్రూప్ స్టేజీలో న్యూజిలాండ్‌తో జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ తలపడనుంది. ఆదివారం జరిగే ఈ మ్యాచ్ కోసం టీమిండియా ప్రాక్టీస్ సెషన్స్ లో పాల్గొంది. అయితే భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నెట్ ప్రాక్టీస్ కు హాజరుకాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పాకిస్థాన్ తో జరిగిన మ్యాచ్ లో రోహిత్ శర్మ కండరాల నొప్పితో బాధపడ్డాడు. అయితే ఆ సమయంలో అది పెద్ద విషయమేమీ కాదని.. తాను బాగానే ఉన్నానని చెప్పాడు.ఐసీసీ అకాడమీలో మిగతా ఆటగాళ్లంతా భారీ కసరత్తులు చేస్తుండగా.. రోహిత్ శర్మ మెల్లగా జాగింగ్ చేసినట్లు తెలుస్తోంది. రోహిత్ శర్మ భారత జట్టు రెగ్యులర్ బ్యాటింగ్ లేదా ఫీల్డింగ్ ప్రాక్టీస్ లో పాల్గొనలేదని తెలిసింది. అందువల్ల రోహిత్ శర్మ కండరాల నొప్పులతో తీవ్రంగా బాధపడుతున్నట్లు అనుమానం కలుగుతోంది. రోహిత్ శర్మ న్యూజిలాండ్ తో జరిగే మ్యాచ్ లో ఆడగలడా?.. అనే సందేహం కూడా కలుగుతోంది. రోహిత్ శర్మ ఈ మ్యాచ్ ఆడలేకపోతే.. న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్ లో వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీని చేపట్టాల్సి ఉంటుంది. అయితే గిల్ కూడా అనారోగ్యంతో ఉన్నారని వార్తలు వస్తున్నాయి. గిల్ స్టేడియానికి కూడా రాలేదని తెలిసింది.




# రజనీకాంత్ సినిమాలో పూజా హెగ్డే

**బలగం టీవి, హైదరాబాద్**


రజనీ కాంత్, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వస్తున్న 'కూలీ' చిత్రంలో పూజా హెగ్డే ఆఫర్ కొట్టేసింది. ఈ సినిమాలో ఆమె ఓ ఐటెం సాంగ్ చేస్తోంది. ఈ మేరకు పూజా హెగ్డే ఫస్ట్ లుక్ ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాను సన్ పిక్చర్స్ నిర్మిస్తుండగా.. నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, చౌబిన్ సాహీర్, శృతి హాసన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.గోల్డ్ స్మగ్లింగ్‌కు సంబంధించిన కథాంశంగా ఈ చిత్రం రూపొందుతుండగా ఇప్పటికే విడుదలైన ప్రోమో, సాంగ్ ఆకట్టుకుంటున్నాయి.

# రాజమౌళి టార్చర్ భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నా...



**బలగం టీవి, హైదరాబాద్**

దిగ్గజ దర్శకుడు రాజమౌళిపై అతడి స్నేహితుడైన ఉప్పలపాటి శ్రీనివాస్ రావు సంచలన ఆరోపణలు చేశారు. రాజమౌళి టార్చర్ భరించలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తీసి విడుదల చేశాడు.అందులో ఆయన మాట్లాడుతూ "రాజమౌళిది నాది 34 ఏళ్ళ స్నేహం. ఈటీవీలో రాజమౌళి శాంతి నివాసం సీరియల్ చెయ్యక ముందు నుంచే మేం ఇద్దరం ఫ్రెండ్స్. ఈ విషయం అందరికి తెలుసు. యమదొంగ సినిమాకి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా నేను చేశాను. కానీ ఒక అమ్మాయి వలన రాజమౌళి తాను విడిపోయాం. అందరి లైఫ్‌లో జరిగినట్లే మా లైఫ్‌లో కూడా ఒక అమ్మాయి ప్రవేశించింది. ముందు రాజమౌళిని ప్రేమించింది. ఆ తర్వాత నన్ను ప్రేమించింది. అచ్చం ఆర్య 2 సినిమా కథలాగే ఉంటుంది. అయితే ముగ్గురం క్లోజ్ కాబట్టి నేను రాజమౌళిని అడిగాను ఇప్పుడు ఏం చేద్దామని. అప్పుడు రాజమౌళి నువ్వు త్యాగం చేయాలి అన్నాడు. దీంతో ఏం ఆలోచించకుండా నేను నా ప్రేమను త్యాగం చేశాను. ఇదంతా శాంతి నివాసం సీరియల్‌కి ముందు జరిగిన ఘటన. అయితే అతను నెంబర్ 1 అయ్యాక నన్ను టార్చర్ పెట్టాడు. దీంతో 55 ఏండ్లు అయిన వాడి వలన పెళ్లి కూడా చేసుకోలేదు. రాజమౌళి స్టార్ డైరెక్టర్ అయ్యాక ఈ విషయం ఎవరికైనా చెప్తానని.. నన్ను ఇండస్ట్రీలో లేకుండా చేశాడు. చివరకి నేను చనిపోయే దాకా తెచ్చాడు. పోలీసులు కేసు ఫైల్ చేసి రాజమౌళికి లై డిటెక్టర్ టెస్ట్ చెయ్యాలి" అని అన్నాడు. రాజమౌళి క్షుద్ర విద్యలని వచ్చని.. అతడికి అడ్డుగా వస్తారని అనుకున్న దర్శకులందరనీ పక్కకు తప్పించి తానే నెంబర్ వన్ డైరెక్ట్ అయ్యాడని వ్యాఖ్యలు చేశారు.



# సల్మాన్ ఖాన్ 'సికందర్' టీజర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

ఏఆర్ మురుగదాస్,సల్మాన్ ఖాన్ కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'సికందర్' . జై హో సినిమా తర్వాత ఏఆర్ మురుగదాస్, సల్మాన్ ఖాన్ కాంబోలో ఈ సినిమా రానుండడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను రంజాన్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. చిత్రబృందం తాజాగా టీజర్‌ను వదిలింది. "నాన్నమ్మ అతడికి సికందర్ అని పేరు పెట్టింది. తాత ఏమో సంజయ్ అని పెట్టాడు. కానీ ప్రజలు మాత్రం అతడిని రాజాసాబ్ అని పిలుస్తారు అంటూ టీజర్ మొదలైంది. ఈ టీజర్ చూస్తుంటే.. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్నట్లు తెలుస్తుంది. ఫుల్ యాక్షన్ ప్యాక్డ్‌గా సాగిన ఈ టీజర్‌ను మీరు చూసేయండి. ఇక ఈ సినిమాను నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తున్నారు. రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తుండగా.. ఈ చిత్రంలో సత్యరాజ్ విలన్‌గా నటిస్తున్నాడు.

# శివుడి గురించి ఆలోచిస్తే అక్షయ్‌కుమార్ గుర్తుకువస్తారు

- **నటుడు మంచు విష్ణు**

**బలగం టీవి, హైదరాబాద్**

కన్నప్ప మూవీ తన డ్రీమ్ అని చెబుతూ వస్తున్న మంచు విష్ణు.. ఎప్పటికప్పుడు ఈ సినిమాపై అంచనాలు పెంచేస్తూనే ఉన్నారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మోహన్ బాబు నిర్మాతగా భారీ ఎత్తున కన్నప్ప తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో మోహన్ లాల్, అక్షయ్ కుమార్, ప్రభాస్, కాజల్, శరత్‌కుమార్.. వంటి స్టార్లు కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన కన్నప్ప అప్ డేట్స్ సినిమాపై హైప్ పెంచేశాయి. ఏప్రిల్ 25న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కాబోతుంది.



తాజాగా ఈ చిత్రం హిందీ టీజర్ లాంఛ్ ఈవెంట్‌లో మంచు మనోజ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శివుడి గురించి ఈ తరంలో ఎవరు ఆలోచించినా అక్షయ్‌కుమార్ రూపమే గుర్తుకువస్తుందన్నారు. మీడియా వాళ్ల కోసం ప్రత్యేకంగా దీని హిందీ టీజర్‌ను లాంఛ్ చేశారు.

"నేను మోహన్‌బాబు కుమారుడిని అని చెప్పడానికి గర్వపడతాను. ఆయన లేకపోతే నేను నటుడిని అయ్యేవాడిని కాదు. ఆయన కారణంగానే అక్షయ్ కుమార్ కూడా ఈ చిత్రంలో నటించారు. చిత్రీకరణ సమయంలో అక్షయ్ నుంచి ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. ఈ చిత్రంలో చేసిన ప్రతిఒక్కరూ వారి పాత్రలకు వందశాతం న్యాయం చేశారు. ఈ చిత్రీకరణ ప్రారంభం అయ్యాక నాలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఉన్నతంగా ఆలోచిస్తున్నా. మోహన్‌లాల్, ప్రభాస్ అందరూ ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డారు. ఈ తరంలో శివుడు అంటే మొదట గుర్తుకువచ్చే పేరు అక్షయ్ కుమారే" అని విష్ణు చెప్పారు.

'కన్నప్ప'ను రెండుసార్లు రిజెక్ట్ చేసినట్లు అక్షయ్ కుమార్ చెప్పారు. విష్ణు, మోహన్‌బాబు ఎన్నోసార్లు ఫోన్ చేశారని కానీ, బిజీగా ఉండడంతో మాట్లాడలేకపోయానన్నారు. వీరిద్దరూ ఆఫీసుకు వచ్చి కలిసి మాట్లాడిన వెంటనే అంగీకరించినట్లు చెప్పారు.

# జూన్ 20న 'కుబేర' విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**




టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల పాన్‌ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్న చిత్రం 'కుబేర'. ప్రధాన పాత్రల్లో అక్కినేని నాగార్జున, తమిళ హీరో ధనుశ్ నటిస్తున్నారు. అలాగే రష్మిక మందన్న కీలక పాత్ర పోషిస్తోంది. అయితే, తాజాగా ఈ చిత్రం రిలీజ్ డేట్‌ను ప్రత్యేక పోస్టర్ ద్వారా మేకర్స్ ప్రకటించారు. జూన్ 20న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా, తాజాగా రిలీజైన పోస్టర్‌ను చిత్ర బృందం ఆసక్తికరంగా రూపొందించింది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను శ్రీవెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌లో సునీల్ నారంగ్, రామ్మోహన్ రావు కలిసి నిర్మిస్తున్నారు.